క్లుప్తంగా

సోమేశ్వరుడికి లక్షబిల్వార్చన



సోమేశ్వరస్వామికి అభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం

కాళ్ల: స్థానిక గంగాపార్వతి సమేత సోమేశ్వర స్వామి వారి దేవస్థానంలో స్వామివారికి గురువారం లక్ష బిల్వార్చన పూజలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామానికి చెందిన మండలపర్తి శ్రీచంద్రశేఖర్, బాల దంపతులతో తొలుత అమ్మవారికి సహస్ర కుంకుమార్చన, రుద్రహోమం నిర్వహించారు. అనంతరం స్వామి వారికి విశేషంగా 11 ద్రవ్యాలతో రుద్రాభిషేకం కార్యక్రమాలు జరిపారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ శుక్రవారం ఉదయం కార్తీకమాసం నేపథ్యంలో పురస్కరించుకుని నిర్వహించే అఖండ అన్నసమారాధన కార్యక్రమానికి భక్తులందరూ విచ్చేయాలని కోరారు.

పోలింగ్ కేంద్రం పరిశీలన



అధికారులకు సూచనలు ఇస్తున్న తహసీల్దార్ సుందర్ సింగ్

కాళ్ల: తూర్పు–పశ్చిమగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా కాళ్లలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని శుక్రవారం తహసీల్దార్ జి.సుందర్ సింగ్ పరిశీలించారు. మండలంలో మొత్తం 52 ఉపాధ్యాయ ఓట్లు ఉన్నాయన్నారు. పోలింగ్ కేంద్రంలో విద్యుత్, తాగునీటి సౌకర్యం, ప్రహరీ, మరుగుదొడ్లు, తదితర వసతుల విషయమై పరిశీలన చేశారు. ఎన్నికలకు మరికొంత సమయం ఉన్నందున కలెక్టర్ ఆదేశానుసారం పోలింగ్ కేంద్రంలో వసతి సౌకర్యాలను పరిశీలిస్తున్నామన్నారు. ఆయన వెంట ఆర్ఐ లక్ష్మీకిరణ్, కార్యదర్శి బి.సతీష్ తదితరులు ఉన్నారు.

కృషి, పట్టుదలే విజయానికి మెట్లు



నిస్సీఫ్లోరాను సత్కరిస్తున్న మానవత స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

ఉండి: కృషి, పట్టుదల ఉంటే చాలు అనుకున్నది సాధించేందుకు వాటిని మెట్లుగా చేసుకుని ఉన్నత శిఖరాలను చేరుకోవచ్చునని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ మండల కార్యదర్శి డాక్టర్ గాదిరాజు రంగరాజు అన్నారు. ఉండి పెదపేటకు చెందిన గోడి నిస్సీఫ్లోరా ఇటీవల నేషనల్ హార్టీకల్చర్ గుజరాత్ డిప్యూటీ డైరెక్టర్‌గా ఎంపికైన సందర్భంగా మానవత స్వచ్ఛంద సేవాస్థ ప్రతినిధులు గురువారం ఆమెను అభినందించారు. అనంతరం సంస్థ తరపున ఆమెను సాదరంగా సత్కరించారు.ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ నిస్సీఫ్లోరా కృషిని కొనియాడారు. కార్యక్రమంలో మానవత మండల చైర్మన్ కొమ్మన నాగబాబు, కన్వీనర్ దంగేటి రామలింగేశ్వరరావు, పెన్మత్స రంగప్రసాద్‌రాజు, గోడి ఏసురత్నం తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం నిర్వహణ నిధుల పెంపు

భీమవరం: పాఠశాలల విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం నిర్వహణకు కేంద్ర ప్రభుత్వం నిధులు పెంచినట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఇ.నారాయణ చెప్పారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పెంచిన మొత్తం డిసెంబర్ 1 నుంచి అమల్లోకి వస్తుందన్నారు. ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఒక్కొక్కరికీ రూ.5.45 పైసల నుంచి రూ.6.19 పైసలకు పెంచగా ఉన్నత పాఠశాలల విద్యార్థులకు రూ. 8.17 పైసల నుంచి రూ.9.26 పైసలకు పెంచినట్లు వివరించారు. భోజన పథకం నిర్వాహకులకు గౌరవ వేతనం బిల్లులు అక్టోబర్ నెల వరకు ఖజానా శాఖకు పంపించామన్నారు. భోజన పథకం నిర్వహణ బిల్లులు ప్రభుత్వం నుంచి విడుదల కాగానే నిర్వాహకులకు చెల్లిస్తామని డీఈవో నారాయణ తెలిపారు.

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటర్ల మొదటి జాబితా సిద్ధం

మొగల్తూరు: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటర్ల మొదటి జాబితాను అధికారులు ఆమోదించారని తహసీల్దార్ కె.రాజకిశోర్ గురువారం విలేకరులకు తెలిపారు. మండలంలని 17 గ్రామాలకు సంబంధించి 1696 దరఖాస్తులు రాగా మొదటి జాబితాలో 1416 మంది ఓటర్ల పేర్లు జాబితాలో నమోదు చేశామని స్పష్టం చేశారు. మిగిలిన దరఖాస్తులను పరిశీలిస్తున్నామని, దరఖాస్తులతో పాటు ఇచ్చిన పత్రాలు సరిగ్గా ఉంటే ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ చేస్తున్నామని, ఏమైనా తేడాలుంటే సంబంధిత ఓటరుకు సమాచారం అందించి దరఖాస్తులను సరి చేస్తున్నామన్నారు. తహసీల్దార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ కేవీ సత్యనారాయణ ఆధ్వర్యంలో బీఎల్‌ఓలు దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను చేపడుతున్నారని వివరించారు.

చిట్టడవిని తలపిస్తున్న ఖాళీ స్థలాలు





మండలంలో పిచ్చి మొక్కలు పెరిగి చిట్టడవిని తలపిస్తున్న పలు ఖాళీ స్థలాలు

- దోమలు, విష సర్పాలకు ఆవాసాలుగా మారిన వైనం
- మలేరియా, డెంగీ వ్యాధులు విజృంభిస్తాయనే భయం
- పట్టించుకోని అధికారులు, స్థల యజమానులు

ఇళ్లలోకి వస్తున్న విష సర్పాలు

ఖాళీ స్థలాల్లో మురుగు నిల్వ ఉండటంతో దోమలు, విష సర్పాలకు ఆవాసాలుగా మారుతున్నాయి. పగలు, రాత్రి అన్న తేడా లేకుండా దోమలు విజృంభించి నివాసితులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా వాటి ధాటికి తట్టుకోలేక పోతున్నామని, లేనిపోని రోగాలను కొని తెచ్చుకునే దుస్థితి దాపురించిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మురుగు తటకాల్లా మారిన ఖాళీ స్థలాల్లో పందులు స్వైర విహారం చేస్తున్నాయని, అలాగే ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కల కారణంగా విష సర్పాలు చేరి రాత్రి సమయాల్లో ఇళ్లలోకి వచ్చేస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు.

వీరవాసరం: మండలంలో ఖాళీ స్థలాలు చిట్టడవిని తలపిస్తున్నాయి. స్థలాల్లో కొందరు నిర్మాణాలు చేపట్టడం లేదు. దీంతో చెట్లు పెరిగిపోతున్నాయి. లోతట్టు ప్రాంతాల్లో మురుగునీరు చేరి దుర్గంధం వెదజల్లుతోంది. అయితే స్థల నిర్వహణ విషయాన్ని పట్టించుకోవాల్సిన యజమానులు మాత్రం స్పందించడం లేదు. దీంతో పరిసర ప్రాంత ప్రజలు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని పలు ప్రాంతాల్లో నివాసాల మధ్య ఉన్న ఖాళీ స్థలాలు ప్రమాదకరంగా మారాయి. తక్కువ రేట్లు ఉన్నప్పుడు కొందరు వ్యక్తులు ఖాళీ స్థలాలను కొని ధరలు పెరిగినప్పుడు అమ్ముకుందామని వదిలివేసిన స్థలాలు ఏళ్ల తరబడి అలానే ఉండిపోయాయి. దీంతో ఆయా ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగిపోయి చిట్టడవులను తలపిస్తున్నాయి. ముఖ్యంగా డ్రెయినేజీ వ్యవస్థ లేని కారణంగా వర్షపు నీరు ఆ స్థలంలో నిలిచి మురుగు పెరిగిపోతుంది. స్థలం ఖాళీగా ఉండటంతో చుట్ట పక్కల నివసించే వారు పడేసే చెత్తా, చెదారం, వ్యర్థాలతో దుర్వాసన వెదజల్లుతోంది. ముఖ్యంగా ఖాళీ స్థలాలు ఎంత అధ్వానంగా ఉన్నప్పటికీ అసాంఘిక శక్తులు అక్కడికి చేరిన స్థానికంగా నివసిస్తున్న వారికి నిద్ర లేకుండా భయభ్రాంతులకు గురి చేయడం పరిపాటిగా మారింది.

బాధ్యత ఎవరిది?

ఖాళీ స్థలాల యజమానులకు అధికారులు నోటీసులు ఇవ్వడంతో పాటు చర్యలు తీసుకోవాల్సి ఉంది. ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కలు తొలగించి, మురుగు నీరు నిల్వ లేకుండా చేయాలని నోటీసులు ఇవ్వాలి. కానీ అధికారులు ఆ దిశగా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. దీంతో మురుగునీరు నిల్వ ఉండడంతో దోమలు విజృంభించి చిన్న పిల్లల నుంచి వృద్ధుల వరకు రోగాల బారిన పడుతున్నారు.

ప్రజారోగ్య శాఖ అధికారుల చర్యలు శూన్యం

ఖాళీ స్థలాల యజమానులు గుర్తించి వారి స్థలాలను శుభ్రం చేయించడం, వాటిలో మెరక చేసుకోవాలని నోటీసులు ఇవ్వాల్సిన సంబంధిత అధికారుల నిర్లక్ష్యం వల్లే ఖాళీ స్థలాలు ప్రమాదకంగా తయారయ్యాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. గతంలో ఖాళీ స్థలాలను గుర్తించి వాటిని శుభ్రం చేసుకోని మెరక చేయించుకోవాలని, లేనిపక్షంలో అధికారులు స్వాధీనం చేసుకుంటామని హెచ్చరిస్తూ నోటీసు బోర్డులు ఏర్పాటు చేసేవారని, ప్రస్తుతం ఆ పరిస్థితి ఎక్కడా కనిపించడం లేదని చెబుతున్నారు.

9 నుంచి ఆన్‌లైన్ ఎఫ్‌డీపీ కార్యక్రమం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కళాశాల సిబ్బంది

భీమవరం: స్థానిక ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో డిసెంబర్ 9 నుంచి ఆరు రోజులుపాటు ఆన్‌లైన్ ఎఫ్‌డీపీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ కె.వి మురళీకృష్ణమరాజు చెప్పారు. ఈ మేరకు గురువారం కార్యక్రమ పోస్టర్‌ను కళాశాల డైరెక్టర్ ఎం.జగపతిరాజు విడుదల చేశారు. ఏఐసీటీఈ ట్రైనింగ్ అండ్ లెర్నింగ్ అకాడమీ ప్రారంభించిన కార్యక్రమాల్లో భాగంగా ఆన్‌లైన్‌లో ఎంపవరింగ్ ఎడ్యుకేటర్స్ ఫర్ ఫ్యాకల్టీ ఎక్సలెన్స్ పేరిట కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ ఆన్‌లైన్ కార్యక్రమంలో ఇంజనీరింగ్ అధ్యాపకులు, పరిశోధకులు నూతన సాంకేతికతను అధ్యయనం చేయాలన్నారు. కార్యక్రమానికి కోఆర్డినేటర్స్‌గా ఎస్‌కే కామేశ్వరరావు, శివశంకర్ రెడ్డి వ్యవహరిస్తున్నారన్నారు.

ఘనంగా సామూహిక సత్యనారాయణ వ్రతాలు

మొగల్తూరు: కార్తీక మాసాన్ని పురస్కరించుకుని స్థానిక రుక్మిణీ సత్యభామా సమేత రాజగోపాల స్వామి వారి ఆలయంలో గురువారం సామూహిక సత్యనారాయణ స్వామి వారి వ్రతాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు సుదర్శనం లక్ష్మీ నరసింహాచార్యులు, రామశేషాచార్యులు, రమేష్ ఆచార్యులు ఆధ్వర్యంలో వ్రత పూజలు జరిపారు. గ్రామానికి చెందిన భక్తులు ఈ వ్రత పూజలో పాల్గొని స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ప్లాస్టిక్ వాడకంతో అనారోగ్యం



అవగహన ర్యాలీ ప్రారంభిస్తున్న మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి

భీమవరం (ప్రకాశంచౌక్): ప్లాస్టిక్ వాడకం అనర్థమని, అర్థరహితమైన ప్లాస్టిక్ అనారోగ్యమని, వాడవాడలా అవగాహనా ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని మున్సిపల్ కమిషనర్ కె రామచంద్రారెడ్డి అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో మెప్మా, పీఆర్‌ట, సీఆర్పీ, మున్సిపల్ ఉద్యోగులు, సర్ సీవీ రామన్ స్కూల్ విద్యార్థులతో ప్లాస్టిక్ నిషేధంపై అవగహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి మాట్లాడుతూ ప్లాస్టిక్ ప్రాణహాని తెలిసి కూడా ప్రజలు విపరీతంగా వినియోగించుకోవడం దారుణమని, ప్లాస్టిక్‌ను నిషేధించి గుడ్డ సంచులనే వాడాలని అన్నారు. అసిస్టెంట్ కమిషనర్ వెంకటేశ్వరావు మాట్లాడుతూ మన ఆరోగ్యాన్ని మనమే కాపాడుకోవాలని, ప్లాస్టిక్ రహిత సమాజం కోసం నడుంబిగించాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సర్ సీవీ రామన్ స్కూల్ ప్రిన్సిపాల్ పెండ్యాల సరితా, అల్లు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ



భీమవరంలో పేదలకు దుప్పట్లు, పండ్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

భీమవరం: బడుగు, బలహీన వర్గాల హక్కుల కోసం పోరాడిన మహాయోధుడు మహాత్మా జ్యోతిరావు పూలే అందరికీ ఆదర్శనీయుడ ఆలిండియా బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నరమామిడి గంగారామ్ అన్నారు. గురువారం భీమవరంలో జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా పేదలకు దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. ముందుగా జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో అసోసియేషన్ మహిళా అధ్యక్షురాలు సూరిశెట్టి కల్పన, ఉపాధ్యక్షుడు కె.కన్నబాబు, పట్టణ ఉపాధ్యక్షుడు కె.వాసు తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయం వద్ద

భీమవరం: మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా పూలే సేవా సమితి, విజ్ఞాన వేదిక సేవా సంస్థ ఆధ్వర్యంలో భీమవరం తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో పూలే చిత్రపటానికి ఉప ఖజానా శాఖ అధికారి అల్లూరి రవివర్మ , జ్యోతిరావు పూలే సేవా సమితి అధ్యక్షులు ఎంపీఆర్ అప్పాజీ పూలమాలలు వేసి నివాళులర్పించారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి, మహిళా విద్య, కార్మికుల శ్రేయస్సు కోసం పోరాటాలు చేసి తన జీవితాన్ని దేశం కోసం అర్పించారని నేటి తరానికి ఆదర్శనీయుడన్నారు. కార్యక్రమంలో అల్లు శ్రీనివాస్, చాన్ బాషా, బోకూరి విజయరాజు, దేవర అక్కిరాజు, యర్రంశెట్టి శ్రీనివాస్ పాల్గొన్నారు.

కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మకు పరామర్శలు



భీమవరంలో కేంద్రమంత్రి శ్రీనివాసవర్మను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే శ్రీనివాస్

భీమవరం: కేంద్ర ఉక్కు, భారీపరిశ్రమశాఖ సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మను భీమవరం మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ గురువారం పరామర్శించారు. శ్రీనివాసవర్మ తండ్రి సూర్యనారాయణరాజు ఇటీవల మృతి చెందడంతో భీమవరం నర్సయ్యఅగ్రహారంలోని శ్రీనివాసవర్మ ఇంటికి వెళ్లి శ్రీనివాస్ పరామర్శించారు. ఆయన వెంట భీమవరం ఎంపీపీ పేరిచర్ల విజయనర్సింహరాజు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు తోట భోగయ్య తదితరులున్నారు. అలాగే రాష్ట్ర మంత్రులు గొట్టిపాటి రవికుమార్, వై.సత్యకుమార్ కేంద్ర మంత్రి వర్మను పరామర్శించారు. శ్రీనివాసవర్మ తండ్రి భూపతిరాజు సూర్యనారాయణరాజు చిత్రపటం వద్ద పూలు వేసి ఘనంగా నివాళులర్పించారు. బీజేపీ రాష్ట్ర మీడియా ఇన్‌చార్జ్ పి.నాగభూషణం, ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామారాజు, మాజీ ఎంపీ తోట సీతారామలక్ష్మి తదితరులున్నారు.

ఎయిడ్స్ నియంత్రణపై అవగాహన



ఆకట్టుకుంటున్న విద్యార్థులు పెయింటింగ్

ఆకివీడు: ఎయిడ్స్ వ్యాధిపై ఆలోచింపజేసే విధంగా విద్యార్థులు చిత్రాలను పెయింటింగ్ ద్వారా వెలుగులోకి తీసుకువచ్చారని ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సుజాత చెప్పారు. మండలంలోని దుంపగడప గ్రామంలోని వీవీ గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం ఎయిడ్స్ నివారణపై అవగాహనా వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు పెయింటింగ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు ఎయిడ్స్ మహమ్మారి ద్వారా మానవాళి మనుగడపై, ముందు జాగ్రత్త చర్యలపై పలు రకాలుగా చిత్రాలను గీశారు. పోటీల్లో షేక్ ఫరీహీన్ మొదటి బహుమతి, నెల్లి వైభవి ద్వితీయ, ఎం.బిందు తృతీయ బహుమతుల్ని గెలుచుకున్నారని ప్రిన్సిపాల్ వివరించారు. కార్యక్రమంలో రెడ్ రిబ్బన్ క్లబ్ సమన్వయకర్త డాక్టర్ టి.ఓగేశ్వరరావు, అధ్యాపకులు జి.సంజీవరాజు, యు.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

10న విజయవాడలో ఉద్యోగుల మహాసభ



తహసీల్దార్ కార్యాలయం వద్ద పోస్టర్ ఆవిష్కరిస్తున్న తహసీల్దార్ వై.దుర్గాకిశోర్

పాలకొల్లు అర్బన్: సీపీఎస్ విధానం అమలు చేయడం వల్ల పదవీ విరమణ చేసిన ఎందరో ఉద్యోగులు పెన్షన్ లేక అనేక ఇబ్బందులు పడుతున్నారని ఏపీ సీపీఎస్ ఉద్యోగుల సంఘ జిల్లా గౌరవాధ్యక్షుడు, తహసీల్దార్ యడ్ల దుర్గాకిశోర్ ఆవేదన వ్యక్తం చేశారు. పాలకొల్లు తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో గురువారం సీపీఎస్ రద్దు కోరుతూ ఈ నెల 10న విజయవాడలో నిర్వహించ తలపెట్టిన ఉద్యోగుల మహాసభ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఏపీఎన్‌జీవో పాలకొల్లు తాలుకా అధ్యక్షుడు గుడాల హరిబాబు, ఎన్జీవో నాయకులు ఎంఆర్‌కే రాజు, రాయుడు, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ, త్రినాథ్, సెక్రటరీసంఘ అధ్యక్షుడు బంగారు శివరామకృష్ణ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కాళ్ల: మండల పరిధిలో 11 కేవీ ఇండస్ట్రియల్ విద్యుత్ లైన్లు చెట్టు కొమ్మలు తొలగింపు పనుల నిమిత్తం శుక్రవారం ఉదయం 8 గంటలు నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు మండలంలోని కోపల్లె, వేంపాడు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నామని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎన్. వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. అలాగే 11 కేవీ కొత్త లైన్ నిమిత్తం ఉదయం 8 గంటలు నుంచి సాయంత్రం 5 గంటల వరకు బొండాడ, ఎల్ఎన్ పురం గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని స్పష్టం చేశారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఏఎస్ఎన్ఎం కళాశాలలో అభివృద్ధిపై జాతీయ సదస్సు

పాలకొల్లు సెంట్రల్: ఎంటర్ ప్రెన్యూర్‌షిప్, బిజినెస్ డెవలప్‌మెంట్ అనేది ఒక విజయవంతమైన వ్యాపారాన్ని ప్రారంభించడానికి, అభివృద్ధిచేయడానికి, వ్యాపార వెంచర్‌ను స్థాపించడానికి, వనరులు నిర్వహించడానికి ఉపయోగపడుతుందని రిసోర్స్ పర్సన్ ప్రొఫెసర్ ఎన్ ఉదయభాస్కర్ అన్నారు. స్థానిక అద్దేపల్లి సత్యనారాయణమూర్తి కళాశాలలో వాణిజ్య విభాగం, ఐక్యూఏసీ ఆధ్వర్యంలో ఇన్స్టిట్యూషన్స్ ఇన్నోవేషన్ కౌన్సిల్లో భాగంగా వ్యవస్థాపకత అభివృద్ధిపై జాతీయ సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.రాజరాజేశ్వరి, నన్నయ్య యూనివర్సిటీ ప్రొఫెసర్ పి.ఉమామహేశ్వరి దేవి పాల్గొన్నారు.

సీహెచ్‌సీలో వైద్యుడి ఖాళీ భర్తీ చేయాలి

పెనుగొండ: పెనుగొండ సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఎండీ స్థాయి వైద్యునిపుణుడు ఖాళీని సత్వరం భర్తీ చేయాలని సీపీఎం కార్యదర్శి షేక్ పాదుషా డిమాండ్ చేశారు. గురువారం పెనుగొండ సీహెచ్‌సీ వద్ద ధర్నా నిర్వహించి సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ జి చంద్ర సావేరికి వినతి పత్రం సమర్పించారు.

6 నుంచి షష్ఠి ఉత్సవాలు



షష్ఠి ఉత్సవాల ఏర్పాట్లపై మాట్లాడుతున్న స్థానిక అర్చకులు, గ్రామ పెద్దలు

ఆకివీడు: స్థానిక వల్లీ దేవ సేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారి షష్ఠి ఉత్సవాలు 6వ తేదీ నుంచి నిర్వహిస్తున్నట్లు అర్చకులు, స్థానిక పెద్దలు తెలిపారు. ఆలయ ప్రాంగణంలో గురువారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఐదు రోజుల పాటు జరిగే ఉత్సవాలను భక్తులు జయప్రదం చేయాలని కోరారు. మొదటి రోజే స్వామివారి కల్యాణం జరుగుతుందన్నారు. ఆలయంలో ఉత్సవ విగ్రహాలు చిన్నవిగా ఉండటం వల్ల పెద్దవాటిని డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణంరాజు ఆర్థిక సహకారంతో కొనుగోలు చేశారని చెప్పారు. ఉత్సవ విగ్రహాలకు సంప్రోక్షణ చేసి, కల్యాణం నిర్వహిస్తారన్నారు. కార్యక్రమంలో అర్చకులు రామకృష్ణ, సుబ్రహ్మణ్య రవి, రామశాస్త్రి, మొవ్వా వెంకటరత్నం, మొవ్వా చందూ, కౌన్సిలర్లు కిమిడి అరుణ కుమారి, నిమ్మల నాగు, మాజీ సర్పంచ్‌లు మన్నే పోతరాజు, గొంట్లా గణపతి, తదితరులు పాల్గొన్నారు.

వరి కోతలను వాయిదా వేసుకోవాలి

పాలకోడేరు: వాతావరణంలో మార్పులు దృష్ట్యా రైతులు కోతలను వాయిదా వేసుకోవడం మంచిదని మండల వ్యవసాయ అధికారి వి.నారాయణ రావు రైతులకు పిలుపునిచ్చారు. ముఖ్యంగా ఈ ఖరీఫ్ సీజన్‌లో మండల వ్యాప్తంగా10,500 ఎకరాలలో వరి సాగు చేశారని, ఇప్పటివరకు సుమారు ఆరువేల ఎకరాల వరకు కోతలు అయినట్టు ఆయన తెలిపారు. కోతలు మెషీన్ ద్వారా కోయడం వల్ల తేమశాతం ఎక్కువగా ఉంటుందని అందువలన కోసిన ధాన్యం ఆరడానికి రెండు మూడు రోజులు సమయం పడుతున్నందున ఈ రెండు మూడు రోజుల్లో వాయుగుండం ప్రభావం ఉన్నట్లు వాతావరణ శాఖ తెలపడంతో ఇంకా కోతలు కోయని అన్నదాతలు కోతలు వాయిదా వేసుకోవాలన్నారు. ఇప్పటివరకు ఆరబెట్టిన ధాన్యాన్ని చాలావరకు రైతు సేవా కేంద్రాల ద్వారా రైతు కోరిన మిల్లులకు తరలించామన్నారు. అంతేకాకుండా అమ్మిన ధాన్యానికి సొమ్ములు 48 గంటల్లో రైతు ఖాతాలకు జమ అవుతున్నట్లు తెలిపారు. ధాన్యం కొనుగోలులో గానీ, అమ్మిన ధాన్యానికి సొమ్ములు జమ కావడంలో గానీ ఏమైనా ఇబ్బందులు ఉంటే వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించాలని కోరారు.

త్వరితగతిన మాసూళ్లు చేసుకోవాలి

వీరవాసరం: రైతులంతా ధాన్యాన్ని త్వరితగతిన మాసూళ్లు చేసుకోవాలని తహసీల్దార్ ఏవి రామాంజనేయులు తెలిపారు. మండలంలోని రాయకుదురు, పంజా వేమవరం, కొణితివాడ, నవుడూరు గ్రామాల్లో గురువారం ప్రత్యేకంగా పర్యటించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ వాతావరణ ప్రభావంవల్ల రైతుకు ఇటువంటి ఇబ్బంది లేకుండా ప్రత్యేకంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

ఐఎస్‌టీఈ ద్వారా సాంకేతిక నైపుణ్యం



విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందిస్తున్న జి.రంగజనార్దన్

భీమవరం: విద్యార్థులకు అవసరమైన సాంకేతిక నైపుణ్యత ఐఎస్‌టీఈ ద్వారా అందుతుందని ఐఎస్‌టీఈ ఆంధ్రప్రదేశ్ సెక్షన్ చైర్మన్ ప్రొఫెసర్ జి.రంగజనార్దన్ అన్నారు. భీమవరం విష్ణు ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో ఇండియన్ సొసైటీ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ స్టూడెంట్ చాప్టర్ (ఐఎస్‌టీఈ) కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రంగజనార్దన్ మాట్లాడుతూ ఆయన మాట్లాడుతూ నైపుణ్యం కలిగిన ఇంజనీర్లను తయారు చేయడం, పారిశ్రామిక అభివృద్ధికి దోహదపడట ఐఎస్‌టీఈ ముఖ్య ఉద్దేశమన్నారు. ఐఎస్‌టీఈ సభ్యుడిగా చేరడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. అలాగే వివిధ పోటీలలో విజేతలగా నిలిచిన విద్యార్థులకు బహుమతులను అందించారు. కార్యక్రమంలో ఐఎస్‌టీఈ నేషనల్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ టీఎస్ఎస్ బాలాజీ, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మంగం వేణు, ఆర్‌వీడీ రామారావు తదితరులు పాల్గొన్నారు.

నేర నియంత్రణలో ప్రజాప్రతినిధులు సహకరించాలి



చిలుకూరులో మాట్లాడుతున్న ఎస్సై నసీరుల్లా

ఉండి: నేరాల నియంత్రణ కోసం గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రజా ప్రతినిధులు, గ్రామ పెద్దలు సహకరించాలని ఉండి ఎస్సై ఎండీ నసీరుల్లా తెలిపారు. గురువారం మండలంలోని చిలుకూరు, మహదేవపట్నం, కోలమూరు, వెలివర్రు గ్రామాల్లో ఆయా గ్రామ సర్పంచ్‌లు, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలతో గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా చిలుకూరులో సర్పంచ్ ముదునూరి వెంకటసోమరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఎస్సై మాట్లాడుతూ అనుకోని విధంగా జరిగే అనేక నేరాల పరిష్కారంలో సీసీ కెమెరాలు ప్రముఖపాత్ర పోషిస్తున్నాయని అన్నారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే ఆ ప్రాంతంలో నేరాలు అదుపులో ఉంటాయన్నారు. ఆయా కార్యక్రమాల్లో సర్పంచ్‌లు నడింపల్లి సత్యవతి, నడింపల్లి రామకృష్ణంరాజు, వనిమా సుబ్బలక్ష్మీశ్రీనివాస్, ముదునూరి సుబ్బరాజు, పెన్మత్స అంజనీదేవి, కార్యదర్శులు కె.గోపాలకృష్ణ, ఎస్‌కే జమాల్, రవి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రి తనిఖీ



రోగులతో మాట్లాడుతున్న ఆర్డీఓ దాసి రాజు

పాలకొల్లు సెంట్రల్: ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు ఏమైనా ఇబ్బందులు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని నరసాపురం ఆర్డీఓ దాసి రాజు అన్నారు. గురువారం పట్టణ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని సందర్శించారు. ఈ సందర్భంగా దాసి రాజు మాట్లాడుతూ ఆసుపత్రిలో ఇన్ పేషెంట్, అవుట్ పేషెంట్ వార్డులను పరిశీలించామన్నారు. వైద్య సేవలు, భోజనం ఏర్పాట్లు, సిబ్బంది డబ్బులు వసూళ్ల చేస్తున్నారా? అంటూ ఆరా తీశామన్నారు. మునిసిపల్ కమిషనర్ బి.విజయసారధి, ఆసుపత్రి సూపరింటెండెంట్ ఒ.రవికుమార్ తదితరులు ఉన్నారు.